# రేపటి చిత్రం

"అమ్మగారూ, ఇదేంటో కుసింత సూసి సెప్పూరూ, కరంటోడు తెచ్చిచేడు" అంది చిట్టమ్మి. పైట కొంగున పదిలంగా ముడేసిన కాయితపు మడతను విప్పి ఇస్తూ "పది రూపాయలీనాం ఇత్తేగాని ఇచ్చేడుకాడు ఆ కరెంట్ బిల్లుల్నాకొడుకు" తిట్టుకుంటూ గిన్నెలు బైట వేసుకుని తోమడానికి సిద్ధమైంది. "అక్కడికీ, నాకొద్దు అట్టుకుపో అన్నాను. అహ పుచ్చుకు తీరాలని పీకలమీద కూకున్నాడు". ఆ కాయితాన్ని పరిశీలించాల్సిన పనేం లేకుండానే తెలిసిపోయింది ఎలక్ట్రిసిటీ బిల్లని, ఆ మాటే చిట్టమ్మికి చెప్పేను.

"అయ్‌బాబోయ్, అప్పుడే బిల్లొచ్చేసిందాండీ, ఎంతొచ్చిందేటండి?" అంది నవ్వుతో మొహాన్ని చేటంత చేసుకుని.

"ఏడు వందలయాభై".

"ఆ..' ఎవరో వీపున బలంకొద్దీ చరిచినట్టు ఉలిక్కిపడింది చిట్టమ్మి. తోముతున్న గిన్నె[illegible]న్లమని ఎత్తేసి, నేనేమనుకుంటానో అని కంగారుగా తిరిగి చేతిలోకి తీసుకుంది".

"సరిగ్గా సూసిసెప్పండమ్మా" అంది వెలవెలపోతూ.

"సరిగ్గానే చూసేను. ఇదిగో ఇక్కడ దేనికది విడివిడిగా ఇచ్చేడు. నీకు చెప్పినా అర్థం కాదు. సర్ ఛార్జెస్ అన్నీ కలుపుకుని ఏడువందల యాభై రూపాయలొచ్చింది".

"సార్జీలన్నీ కలుపుకోటానికి నా ఇంటికెన్ని లైట్లున్నాయండి? ఒకే ఒక్క బలుబు, అది కూడా పెద్ద బలుబైతే కరెంట్ ఎక్కువ లాగేత్తదన్నారని కిరసనాయిలు బుడ్డీ కన్నా కుసింత ఎల్తురెక్కువున్న బలుబు కొనుక్కొచ్చేను, నేను ఒద్దు ఒద్దంటే ఇనకుండా మా కుర్రోడు సదుకోటానికొక లైటుండాలని ఈది గుమ్మంలో ఓటేయించేడండి. దానికింకా బలుబే కొనెట్టలేదు". బండెడు చాకిరీకైనా పట్టనన్ని చెమటలు దిగబోసాయి చిట్టమ్మికి.

"ఎన్నాళ్లైంది నీ ఇంటికి సర్వీసిచ్చి, అదే లైట్లు వెలిగి?"

"నెలా పదేనురోజులండి" అంది కళ్ల నీళ్ల పర్యంతమౌతూ.

"ఈ మధ్య ఏవో స్పెషల్ ఛార్జెస్ అవీ ఇవీ అని వేస్తున్నార్లే, మాకైతే రెండు వేలకి పైనే వచ్చింది".

"అయ్యన్నీ మీలాటోరికండి, మీకు ఫ్రిజ్జులూ, టీవీలూ గట్రా ఉంటయ్యండి. మాకేటున్నాయండి? పిల్లలు సీకట్లో తడుంకుంటా తిరుగుతున్నారు ఏదో అప్పో సప్పో చేసి తీర్చుకుందార్లే అన్నాడండి మా సచ్చినోడు. వైర్లూ తీగెలూ గొట్టాలూ గిట్టాలూ కొనుక్కొచ్చి ఏసినందుకు ఆయప్పారావు గాడు పదేనొందలుచ్చుకున్నాడండి. అక్కడికీ బలుబు నేనే కొనుక్కొచ్చుకున్నానండి. అన్నీ బిగించేక కరంటాపీసుకి డబ్బు కట్టాలన్నాడండి. దానికో ఎయ్యైందండి. ఎయ్యీ కట్టించుకుని ఎంటనే ఇచ్చేరేటండి. ఏడాది పాటు తంబం మీంచి వైరే లాగలేదండి. ఆకరికి మావోడెల్లి ఆళ్ళ కడుపులూ కాళ్ళూపట్టుకుని, ఆరుసెప్పిన పనల్లా సేస్తేనండి వైరు లాగేరండి. నేనొద్దొద్దంటుంటే దింపేసిందండి మా యత్తనాసైతి. ఉప్పుడే కుంత కర్సౌతాది ఆ తర్వాత నెలకి ముప్పై కట్టుకుంటే సాలన్నాదండి బాబో..." రెండు చేతులూ నెత్తిన పెట్టుకుని హతాశురాలై గోడకి చేరబడిపోయి నోటికొచ్చిందల్లా మాట్లాడేస్తోంది చిట్టమ్మి.

"కంగారుపడకు, కనుక్కుందాంలే" అన్నాను కొంతైనా ఓదార్చాలని.

"ఏటి కనుక్కుంటారండి, గవుర్మెంటుతో పని, ఆళ్ళన్నాటైముకి కట్టాపోతే ఆ వైరుకాత్తా లాక్కుపోతారండి. మా యత్త ముందే సెప్పింది".

"ఇంక రెండ్రోజులే టైముంది. అప్పో సప్పో చేసి ముందాడబ్బు కట్టెయ్ తర్వాత చూడొచ్చు".

"ఎక్కట్నుంచి తెచ్చి కట్టనండి, ఒకటా రెండా, ఏడొందల యాభైరూపాయలు. ఎవరిత్తారండి? ఉప్పుడు కొచ్చి ఇంటి మీద పాతప్పే తీరలేదు. మళ్ళీ ఆ సావుకారు బాబునే కడుపో కాళ్ళో అట్టుకోవాల".

"...."

"అయినా దేనికైనా గానీండి, గవుర్మెంటుకి ముందు డబ్బులిత్తే అయ్యింక ఎనక్కి రావటం ఉత్తిదేనంట. బూడిదిలో పోసిన పన్నీరంటండి. ఆటాసింక ఒదులు కోవలసిందేనంట" ఏడుస్తోంది చిట్టమ్మి.

దీనికంతటికీ ఒక విధంగా కారణం నేను కూడా, "పిల్లల్ని బళ్ళో వేసావు కదా, ఎలాగో కష్టపడి కరెంటుదీపం వేయించు, వాళ్ళ రాత్రులు చదువుకోవడానికి బావుంటుంది" అంటూ ప్రోత్సహించాను.

చిట్టమ్మి ఇల్లు మా కాలనీకి దగ్గర్లో ఉన్న స్లమ్ ఏరియాలో ఉంది. మొన్నటి ఎన్నికల ముందు వరకూ అది పెంటదిబ్బ మీది పూరిపాక, ఎన్నికల్లో ఓట్లు కావాల్సిన ఓ పార్టీవారు అక్కడి పాకలన్నీ పీకేయించి, 'పక్కా ఇళ్లు నిర్మిస్తున్నాం' అంటూ ఆదరాబాదరా ఒకో గది కట్టడం ప్రారంభించారు.

అప్పటి మంత్రి గారొచ్చి శంకుస్థాపన చేసి హడావుడి చేశారు. ఆయనకీ, ఆయన వెనుకున్న మందీ మార్బలానికీ మా వూరి రాజకీయ జనాలు మంచిపార్టీ ఇచ్చి, ఖరీదైన బాణసంచాకాల్చి సంబరపడ్డారు.

సగం సగం గోడలు లేచేసరికి ఎలక్షన్స్ ముగిసిపోయాయి. మంత్రిగారు మారిపోయాడు. ఫండ్స్ లేవన్నారు. సగం గోడల పక్కా ఇళ్ళు ముగించే నాథుడు లేక ఆగిపోయాయి. మిగిలిన వాళ్లంతా ఏం చేసేరో తెలీదు కానీ చిట్టమ్మి మాత్రం తను పని చేసే ఇళ్ల వాళ్లందరి దగ్గరా కొంత డబ్బు ఎడ్వాన్సుగా తీసుకుని ఇంటిపని పూర్తి చేసుకుంది. అలా చిట్టమ్మి నలభైగజాల పాక స్థానే ఓ చిన్న పెంకుటిల్లు అమరింది. కొత్తగా వచ్చిన మంత్రిగారి 'ఇంటింటికో బల్బు' నినాదం విని నేను చిట్టమ్మిని ప్రోత్సహించేను పవర్ కనెక్షన్ ఇప్పించుకోమని.

చిట్టమ్మి తొందర తొందరగా పని ముగించి చేతులు పైటకొంగుతో తుడుచు కుంటూ "అమ్మగారూ ముప్పై రూపాయలుంటే ఇవ్వరా జీతంలో చూసుకుందాం" అంది.

ఏడువందల యాభైకి ముప్పైకీ లంగరందక "ఈ ముప్పై ఏంటి మళ్లీ, పిల్లలు బావున్నారా?" అన్నాను. సాధారణంగా పిల్లలకి ఆరోగ్యం బాగా లేనప్పుడు ఇలా జీతంలోంచి ఎడ్వాన్స్ అడుగుతూ ఉంటుంది.

"కార్డు ఇడిపించుకోవాలండి" అంది.

"కార్డేంటి?"

"రేషన్ కార్డండి, మా తెల్ల కార్డు మీద తుపాను బియ్యం ఇత్తన్నారు కదండీ ఇరవై కేజీలు, ఇప్పుడది ఇడిపించుకోపోతే ఉత్తినే వచ్చే ఆ బియ్యం గింజలకి నీళ్లొదులు కోవలసిందేనండి".

"రేషను కార్డు తాకట్టు పెట్టేవా?" అన్నాను నేను చిట్టమ్మి కళ్లల్లోకి ఆశ్చర్యంగా చూస్తూ.

"ఏం సెయ్యనండి అప్పుడికేదో అలాగ పేణం మీదకొచ్చిందండి" అంది కళ్లు దించుకుని.

"కార్డులు కుదవ పెట్టుకుని డబ్బులిచ్చే వాళ్ళు కూడా ఉన్నారన్నమాట!"

"మీకు తెలవకపోవచ్చుగానీండి, ఈ వూళ్ళో డబ్బులున్నమ్మలు సేనామంది ఇళ్ళ కాడ కూకుని సేసీ పనదేనండి. మా వోళ్ళ కార్డులన్నీ తాకట్టులోనే ఉన్నయ్యండి, కార్డుకి వడ్డీ ఉండదండి, ఆటి మీద రేసన్లో ఇచ్చియ్యన్నీ ఆరే తెచ్చుకుంటారు కాని, ఒక సరతండి, సేతిలో డబ్బులున్నాసరే ఏడాదిలోపల ఇడిపించుకోకూడదండి కార్డుని. ఏడాదేటండి, రెండేళ్లపై మాటే నేను కార్డు తాకట్టెట్టి".

నేను అవాక్కయ్యాను. ప్రభుత్వం సబ్సిడీల పేరుతో చేస్తున్న పన్లన్నీ ఇంత బాగా సద్వినియోగం అవుతున్నాయన్నమాట! ఇంకా ఏ మూలో సంశయం.

"మీ కార్డుల మీద ఇచ్చే ముతక బియ్యంతో వాళ్లకేంపని?"

"బలేవోరేనండమ్మ గారూ మీరు, ముతకబియ్యం ఆరు తింటారేటండి. తిరిగి మాకే అమ్ముతారు. రేసనుకాడ కేజి మూడున్నరకి తెచ్చి మాకు ఎనిమిదికి తొమ్మిదికీ అమ్ముతారు. కిరసనూని రేసనుకాడ మూడ్రూపాయలైతే బైట పదీ, పన్నిండూనండి, మాకిచ్చీ కేజీ పంచదార మేవేం జేసుకుంటావండి! అయ్యన్నీ ఒక్కసారే డబ్బెట్టి తెచ్చుకోలేంకదండి, అందుకే కార్డు లారికిచ్చేసి మేం సిల్లరగా కొనుక్కుంటాం".

నేనింక ఆలస్యం చెయ్యలేదు. ముప్ఫై రూపాయలు తెచ్చిచ్చి "ముందెళ్ళి ఆ కార్డు తెచ్చుకో. ఇంకెప్పుడూ ఇలాంటి తెలివి తక్కువ పని చెయ్యకు. రేషను తెచ్చుకోడానికి డబ్బులు కావాలంటే నువ్వు పని చేస్తున్న ఇళ్ళవాళ్లం ఎవరో ఒకళ్ళం ఇవ్వమా" అన్నాను కోపంగా.

సాయంకాలం ముభావంగా పని చేసుకుపోతున్న చిట్టెమ్మిని పలకరించేను.

"ఉదయం కోప్పడ్డానని అలిగేవా? కార్డు విడిపించుకున్నావా? బియ్యం తెచ్చుకున్నావా?"

చిట్టెమ్మి నా వేపు నిర్లిప్తంగా చూసింది. "ఇంకెక్కడి బియ్యమండి, ఈ నెల కొచ్చియ్యన్నీ ఆరు ముందే తెచ్చేసుకున్నారంటండి. కార్డు మాత్రం ఇడిపించుకొచ్చేనండి. 'అయ్యొచ్చే దాకా అమాసాగుద్దా' అని ఏలాకోలం ఆడిందండా తల్లి".

ఎంత అన్యాయం! రేషన్లో సరుకులు ఇంకా పదిహేను రోజుల పాటు ఇస్తారు. ఈ వ్యవస్థ నెవరైనా బాగు చేయగలరా?

నిజం చెప్పాలంటే ఈ వూరిపైన తుఫాను ప్రభావం పెద్దగా లేదు. కోనసీమకు దూరంగా ఉన్న ఊళ్ళకు తుఫాను ఉధృతం అంతగా తాకలేదు. రాత్రంతా హోరున గాలివీచింది. వాన కురిసింది. కొండలపైన కురిసిన వర్షపునీరు వూరి పుంతదారి గుండా

ప్రవహించి తూర్పువైపు పల్లపు పొలాలలో వేసి ఉంచిన ధాన్యపుకుప్పల్ని తడుపుకుంటూ పోయింది. పల్లపుపొలాల రైతులంతా ఆర్థికంగా వెసలుబాటు ఉన్నవాళ్లే కాబట్టి నీరు తియ్యగానే ట్రాక్టర్ల మీద పనల్ని పొడినేలకు తెచ్చి నూర్పిళ్లు జరిపేరు. కుప్పల అడుగుపనల ధాన్యం తడిసి రంగుమారి ధర కొంచెం తక్కువ పలికింది. అంతకు మించి నష్టమేం జరగలేదు. అయినా ఈ వూరు కూడా తుఫాను బాధిత ప్రాంతంగా నమోదై ఉచిత పంపకాలు జరిగాయి. ఆ పంపకాల్ని నిర్దేశింపబడిన వాళ్లు కాకుండా అన్యులెలా అందుకున్నారో తెలియడానికి చిట్టమ్మి కార్డు ఉదంతం చాలు.

ఉన్నట్టుండి ఓరోజు మా కాలనీ పంచాయితీ మెంబరొచ్చి కుంకం భరిణ తెచ్చి బొట్టుంచి మరీ పిల్చింది. "రేపు మనం అందరం శ్రమదానం చేస్తున్నాం, పట్టుచీర కట్టుకుని రండి".

శ్రమదానానికి పట్టుచీరేవిటా అని బిత్తరపోతూ "ఎక్కడ శ్రమదానం?" అడిగాను.

"ఇక్కడే, మన వీధిలోనే" అందావిడ హుషారుగా. "మనం శ్రమదానం చేసి పేపర్లో ఫోటోలు వేయించుకున్నామనుకోండి, ప్రభుత్వం మనకి ఇరవయ్యో, ముప్ఫయ్యో లక్షలు శాంక్షన్ చేస్తుంది.

"మనకా?"

"అదే, మనకంటే మన పంచాయితీకి, మన గ్రామం బాగుంటేనే కదా మనమూ బాగుండేది!" ఓ చిన్న ఉపన్యాసం ఇవ్వడానికి సిద్ధపడిందావిడ.

"ఇంటిపనీ, పిల్లల్తోనే చచ్చి సగమౌతున్నాం. ఈ ఎండన పడి మనవేం శ్రమదానం చెయ్యగలం లెండి, అందునా పట్టుచీరలు కట్టుకుని".

"మీరు బలేవారండీ, తెలిసి మాట్లాడతారో తెలీక మాట్లాడతారో నాకస్సలు అర్థం కాదు. ఇప్పుడు వస్తున్న శ్రమదానం ఫోటోల వాళ్లంతా నిజంగా రోజంతా పని చేసి అలిసిపోతారని మీ ఉద్దేశ్యమా?"

"మరి?"

"ఓ పదిమంది కూలివాళ్లని మాట్లాడతాం. అఫ్‌కోర్స్, కూలిడబ్బులు మనమే ఇస్తామనుకోండి. ఫోటోలు, వీడియోల వరకూ మనం పారలూ, పలుగులూ పట్టుకుని పోజులిస్తాం. ఆ తర్వాత పనివాళ్ళచేత పని చేయిస్తాం".

"శ్రమ వాళ్లదీ, పేరు మనదీనన్నమాట!".

"అలా అనకండి, డబ్బు ఖర్చు పెడుతున్నాం. పేరు తెచ్చుకుంటున్నాం. ఎలా అయితేనేం పని జరుగుతోందని ఒప్పుకుంటారా లేదా?"

ఆవిడతో వాదించి నెగ్గలేనని అర్థమై మిన్నకుండిపోయాను. ఎప్పుడూ ఇల్లువిడిచి బైటికిరాని మా వూరి సర్పంచిగారూ, ఆవిడకు బదులుగా పంచాయితీ వ్యవహారాలన్నీ చక్కబెట్టే ఆవిడగారి శ్రీవారూ ఫోటోల్లో ప్రముఖంగా పడ్డారు. మొహాలు ఆనవాలు తెలీకపోయినా. పచ్చచీర కట్టుకున్నది మన అమ్మే, ఇదిగో ఈ ఎర్రచీరలో ఉన్నది మన పక్కింటి ఆంటీ కావచ్చు" అంటూ పేపరు పుచ్చుకుని మా పిల్లలు చాలా సేపు ఎంజాయ్ చేసారు.

❀❀❀

"అన్నయ్యా! దుబారా అనే పదాన్ని వాక్యంలో ఉపయోగించమన్నారు మా టీచర్. ఎలా రాయాలో కొంచెం చెప్పవా" అడిగింది మా పాప.

"ప్రభుత్వం వారు ధనమును దుబారా చేయుదురు" టకీమని చెప్పేడు మావాడు. నాకు నవ్వొచ్చింది.

"అదేంట్రా, శ్రమదానం అదీ ఇదీ అని ప్రభుత్వం విపరీతంగా పొదుపు చేస్తూంటే నువ్వు దుబారా అంటావ్. మనలాంటి చిన్న ఉద్యోగులు చచ్చీ చెడీ బేంకుల్లో దాచుకున్న డబ్బులకి వడ్డీరేట్లు కూడా తగ్గించేసారు తెల్సా".

"అదంతా నాకు తెలీదు. మనం రాజమండ్రి అమ్మమ్మ ఇంటికెళ్లినప్పుడు బొమ్మూరు మిట్టపైన ఉన్న యూనివర్సిటీ చూడ్డానికెళ్లేమా లేదా?"

"వెళ్లేం"

"అక్కడ అవసరాన్ని మించి కట్టిన బిల్డింగులన్నీ నిరుపయోగంగా పాడైపోతున్నాయా లేదా? వాటి కోసం ప్రభుత్వం కొన్ని కోట్లు ఖర్చు పెట్టిందని నువ్వే కదా చెప్పేవు. అలా కట్టేసి నిరుపయోగంగా వదిలేసిన ఎన్ని బిల్డింగుల్ని మనం రోజూ వార్తల్లో చూడ్డం లేదూ! అదంతా దుబారా అవునా కాదా? అత్తయ్య వాళ్ల ఊళ్లో ఊరంతా కలిపి పది నీటిపంపులు కూడా లేవు. వాటికి మూడు కోట్లు ఖర్చు పెట్టిందట ప్రభుత్వం. పక్కింటి ఆంటీగారు హాండ్ పంపు వేయిస్తే ఐదువేలేగా ఖర్చైందన్నారు". వాడు నా మొహంలోకి ప్రశ్నార్థంగా చూస్తున్నాడు. నేనేం మాట్లాడలేకపోయాను. ఇంకా ఎన్నెన్నో దుబారాలు, దుర్వినియోగాలు గురించి తెల్సినా ఏమి చెయ్యలేని సామాన్య కార్మికుడి భార్యను నేను. మనం మూడు లక్షల్లో కట్టుకున్న భవనానికి ప్రభుత్వం ముప్పైలక్షలు ఖర్చు చేస్తుందని తెలిసీ ఏమి పట్టించుకోని సమాజంలో బతుకుతున్నదాన్ని. ఏదెలా పోతే నాకేం. నేనూ నా వాళ్లూ బావుంటే చాలనుకునే పగటు జీవిని.

మే నెలలో కాస్త చల్లగా ఉంటుందని మా పిల్లల్ని తీసుకుని విశాఖపట్నం మా అన్నయ్య ఇంటికెళ్లేను ఓ పది రోజులు. చిట్టమ్మి కొడుకు రాజు మా రవితోనే ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. రవి పిలిస్తే వాడూ వచ్చాడు మా వెంట.

మా అన్నయ్య మంచి లేండ్‌స్కేప్స్ గీస్తాడు. పిల్లలంతా వాడి చుట్టూ చేరిపోయేవాళ్లు. వచ్చే ముందు పిల్లలందరికీ వాటర్ కలర్స్, చిన్ని చిన్ని బ్రష్షులు కొనిచ్చాడు. వచ్చినప్పట్నుంచీ మా పిల్లలు దొరికిన పేపర్స్ మీద చేతికొచ్చిన రంగులన్నీ పులిమేసి ఓ ఆల్బమ్ తయారు చేసేసుకుంటున్నారు. ఆ రోజు ఓ అద్భుతం జరిగింది. సాయంకాలం అందరం మా చిన్న వాకిట్లో పూలమొక్కల మధ్య కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాం. చిట్టమ్మి కొడుకు రాజు రవి కోసం కాబోలు హుషారుగా వచ్చి, మమ్మల్ని చూసి సంశయంతో ఆగిపోయాడు. రవి చొరవగా వాడి చేతిలో రోల్ చేసిన కార్డ్ బోర్డ్ షీట్ తీసుకుని విప్పి చూసి ఓ చిన్న కేక పెట్టేడు. మేం కబుర్లాపి అటు చూసేం.

అద్భుతమైన దృశ్యాన్ని చిత్రించుకొచ్చాడు రాజు

కెరటాల్తో ఎగసి పడుతోన్న నీలి సముద్రం, పైన ఆకాశంలో దట్టంగా నల్లని మేఘాలు, రెంటికీ మధ్య సన్నని తెల్లని క్షితిజ రేఖ, మేఘాల నుంచి సముద్ర జలాన్ని తాకుతూన్న విద్యుల్లతలు, ఒడ్డున ఇసుక మీద పరచుకున్న తెల్లని కెరటాల నురుగు.

సముద్రం మీద దూరంగా దీపతోరణాల్లాంటి ఓడలు, హడావుడిగా ఒడ్డుకు చేరుకుంటున్న బుల్లి బుల్లి పడవలు, మబ్బుల మధ్య మసక బారుతున్న డాల్ఫిన్స్ నోస్.

బీచ్‌లోని సిమెంట్ సోఫాలో ఒకే ఒక కుర్రాడు ప్రకృతి బీభత్సాన్ని పట్టించుకోకుండా తలవంచి ఇసుకలో దేన్నో వెదుకుతున్నాడు. కింద తడిసిన ఇసుకలోని రంధ్రాల నుంచి చిన్న చిన్న ఎండ్రకాయలు తేనెరంగువి బైటికొచ్చి ఎటుపోవాలో తెలీక పరుగులు పెడుతున్నాయి. ప్రతి ఎండ్రకాయ వెనుకా ఓ క్వొశ్చన్ మార్కు వేసి ఉంది.

నేనాశ్చర్యపోయాను. చిత్రంలో చిన్న చిన్న లోపాలుండి ఉండవచ్చు. కాని వాడుదేన్ని ప్రశ్నిస్తున్నాడో నాకర్థమైంది.

ఉదయం రవి వేసిన ప్రశ్నలూ, ఈ చిత్రంలో రాజు ప్రశ్నిస్తున్న తీరూ చూసి నాకు ఆనందం ఎగసివచ్చింది.

రేపటితరం ఏమీ పట్టించుకోకుండా తలదించుకుని బతికే తరం కాదు. వాళ్లు దేన్నైనా ప్రశ్నించగల సత్తా ఉన్నవాళ్ళు.

*భూమిక, సెప్టెంబరు - డిసెంబరు, 2000*